క్లుప్తంగా

ఘనంగా గోదారంగనాయక స్వామి కల్యాణం


బుట్టాయగూడెం శివారు కొత్తపేటలో గోదా రంగనాథస్వామి కల్యాణోత్సవం

బుట్టాయగూడెం: బుట్టాయగూడెంలోని కొత్తపేటలో ఉన్న నందగోపాల రాధాకృష్ణ స్వామి ఆలయంలో ధనుర్మాస పర్వదినంలో భోగి సందర్భంగా గోదా రంగనాథ స్వామి కల్యాణ మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూచిపూడి రామకృష్ణ, కూచిపూడి రమేష్ చౌదరి, డాక్టర్ జనార్దన్ దంపతులు పాల్గొన్నారు.

పారిజాత గిరిలో ఘనంగా గోదాదేవి కల్యాణోత్సవం


పారిజాతగిరిపై గోదాదేవి కల్యాణ దృశ్యం

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాత గిరి వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో డిసెంబర్ 16 నుంచి ప్రారంభమైన ధనుర్మాస ఉత్సవాలు సోమవారం నిర్వహించిన గోదా కల్యాణంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయ కల్యాణ మండపంలో సుందరంగా అలంకరించబడిన వేదికపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని ఒకవైపు గోదా సమేత శ్రీ రంగనాథుని మరొకవైపు అలంకరించి వేదమంత్రాలతో గోదా రంగనాథుల కల్యాణ మహోత్సవాన్ని అత్యంత రమనీయంగా ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. వికాస తరంగిని సభ్యులు, అభివృద్ధి కమిటీ సభ్యులు దండు ధనరాజు, వాసవి సాయి నగేష్, కార్యనిర్వాహణ అధికారి మాణికల రాంబాబు పాల్గొన్నారు.

కనుమ ఉత్సవానికి సిద్ధం

ద్వారకాతిరుమల: శ్రీవారి కనుమ ఉత్సవానికి సర్వం సిద్ధమైంది. ఈనెల 15న మండలంలోని దొరసానిపాడులో ఉన్న కనుమ మండపంలో ఈ ఉత్సవాన్ని దేవస్థానం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించనున్నారు. సిబ్బంది ఇప్పటికే కనుమ మండపాన్ని, పరిసరాలను సుందరీకరించారు. ఏటా సంక్రాంతి పండుగ మరుసటి రోజు కనుమ నాడు స్వామి వారు, ఉభయ దేవేరులతో కలిసి దొరసానిపాడు గ్రామోత్సవానికి వెళ్తారు. స్వామివారి ఆగమనం కోసం ఆ గ్రామస్తులు నియమనిష్ఠలతో, భక్తి ప్రపత్తులతో నిరీక్షిస్తారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం స్వామివారు ఉభయ దేవేరులతో కలసి రాజాధిరాజ వాహనంపై క్షేత్రం నుంచి బయలుదేరి మండపానికి చేరుకుంటారు. అనంతరం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆ తరువాత గిరిప్రదక్షిణగా ఆలయానికి చేరుకుంటారని ఆలయ ఇన్‌చార్జి ఈఓ వేండ్ర త్రినాథరావు కోరారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.2.15 లక్షల విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఇద్దరు భక్తులు సోమవారం వేర్వేరుగా రూ. 2,15,255 విరాళంగా అందజేశారు. అందులో భాగంగా తాడేపల్లిగూడెంకు చెందిన ఎస్వీఎస్ఎన్ ప్రకాష్ రూ.1,04,139, గన్నవరానికి చెందిన సీహెచ్ శివరామకృష్ణప్రసాద్ రూ.1,11,116 ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు విరాళం బాండ్ పత్రాలను అందించారు.

కోజ..యమ క్రేజ్



ద్వారకాతిరుమల: పందెం కోడి పుంజు కోజ మాంసం అంటే మాంసాహార ప్రియుల నోరూరుతుంది. పందెం బరుల వద్ద కోజ మాంసానికి డిమాండ్ పెరిగింది. పందెంలో ఓడిపోయిన పుంజులను కొందరు బరి వద్దే కాల్చి, సైజును బట్టి రూ.5 వేల నుంచి రూ.8 వేలకు విక్రయిస్తున్నారు. మరికొందరు వాటిని విక్రయించడానికి ఇష్టపడలేదు. తమ బంధువులు, ఆత్మీయులకు పంపించేందుకు కొందరు కోజ మాంసం కొనుగోలు చేస్తున్నారు. ద్వారకాతిరుమల మండలం గుణ్ణంపల్లి, తిమ్మాపురంలోని పందేల బరుల వద్ద కోజ మాంసం విక్రయాలు జోరుగా సాగాయి.

శివాలయాల్లో పూజలు

జంగారెడ్డిగూడెం: శివ ముక్కోటి సందర్భంగా జంగారెడ్డిగూడెంలోని శివాలయాలు శివనామ స్మరణతో హోరెత్తాయి. సోమవారం, ఆరుద్ర నక్షత్రంతో కలిసి వచ్చిన పుష్య పౌర్ణమి కావడంతో భక్తులు అధిక సంఖ్యలో శివాలయాలకు చేరుకున్నారు. ముక్కంటిని దర్శించుకుని పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఉత్తర ద్వార దర్శనం ద్వార స్వామి వారు దర్శనమిచ్చారు. అర్చకులు మాట్లాడుతూ ఆరుద్ర నక్షత్రం శివుని జన్మ నక్షత్రమని, సోమవారం ఆరుద్ర నక్షత్రం కూడిన పౌర్ణమి రావడం అరుదని ఆయన అన్నారు.శివముక్కోటి సందర్భంగా పేరంపేట రోడ్డులోని శివాలయంలో రాత్రి 7 గంటలకు సువర్చలా అంజనేయ స్వామి కల్యాణం నిర్వహించారు.

ఏజెన్సీలో యథేచ్ఛగా కోడిపందేలు

- మెట్టలో కత్తులు దూసిన కోళ్లు
- ఒక్కో బరి వద్ద రూ.లక్షల్లో పందేలు

కొయ్యలగూడెం, బుట్టాయగూడెం,లింగపాలెం, చింతలపూడి: కోడిపందేల నిర్వహణపై పోలీసులు, రెవెన్యూ అధికారులు ఎన్ని హెచ్చరికలు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. అనుకున్నట్టుగానే పండుగ మూడురోజులపాటు కోడిపందేలు కొనసాగించేందుకు ఏర్పాట్లు చేశారు. పండుగ మొదటిరోజైన భోగి నాడు సోమవారం గిరిజన ప్రాంతంలో యథేచ్ఛగా కోడిపందేలు ప్రారంభమయ్యాయి. కోడిపందేల మాటున జూద క్రీడలు, మద్యం విక్రయాలు భారీగా సాగాయి. బరుల వద్ద భారీగా గుండాట, కోత ముక్కల ఆట ఏర్పాటు చేశారు. పందేలకు వచ్చిన వారికోసం బరి వద్ద పలావులు, చికెన్ పకోడి వంటి దుకాణాలు ఏర్పాటు చేశారు. ఒక్కో పందెంలో లక్షల రూపాయలు చేతులు మారాయి.పందేలు నిర్వహిస్తున్న ప్రాంతాలు జాతరను తలపించాయి. స్థానికులతోపాటు ఇతర జిల్లాల నుంచి పలువురు వేలాదిగా తరలివచ్చి పందేలను తిలకించారు.


రామానాజపురంలో కోడిపందేలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు


కొయ్యలగూడెం: రామానుజపురంలో కోడిపందేల బరి వద్ద గుండాట

●కొయ్యలగూడెం మండల వ్యాప్తంగా పన్నెండు చోట్ల కోడిపందేల బరులు ఏర్పాటు చేశారు.మండలంలో రామానుజపురంలో నిర్వహించిన కోడి పందేలను పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు లాంఛనంగా ప్రారంభించారు. నరసన్నపాలెం–రామానుజపురం ప్రాంతంలో ఏర్పాటు చేసిన బరిలో ఎక్కువ కోడి పందేలు గెలిచిన విజేతలకు రోజుకొక బుల్లెట్‌ను బహూకరిస్తున్నట్లు తెలిపారు. ఈ బుల్లెట్లను ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ప్రారంభించారు. గవరవరం, రాజవరం, దిప్పకాయలపాడు, బయ్యనగూడెం, పొంగుటూరు, యర్రంపేట, కన్నాపురం , పరింపూడి, వేదాంతపురం పంచాయతీల పరిధిలో భారీ పందేలు నిర్వహించారు.

●బుట్టాయగూడెంలో తహసీల్దార్ కార్యాలయానికి అతి తక్కువ దూరంలోనే కోడి పందేలను నిర్వహించారు. దొరమామిడి, దుద్దుకూరు, రెడ్డిగణపవరం, కొమ్ముగూడెం, కొవ్వాడ, అంతర్వేదిగూడెం, యర్రాయిగూడెంలో కోడిపందేలు, జూదాలు నిర్వహించారు. జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెం, రాచన్నగూడెం, అంకన్నగూడెంలో కోడిపందేలు నిర్వహించారు. కామయ్యపాలెంలో పందేలను ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ప్రారంభించారు.

●మెట్టప్రాంతమైన లింగపాలెం మండలంలో భారీ ఎత్తున సోమవారం కోడిపందేలు యథేచ్ఛగా నిర్వహించారు. లింగపాలెం, శింగగూడెం, కలరాయనగూడెం, ములగలంపాడు,కె గోకవరం, బాదరాల, ఆశన్నగూడెం, ధర్మాజీగూడెంలో నిర్వహించిన కోడి పందేలు తిరునాళ్లను తలపించాయి. కలరాయనగూడెంలో కోడిపందేలను ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తిలకించారు. శింగగూడెం, అయ్యపరాజుగూడెం, ధర్మాజీగూడెం, కలరాయునగూడెం, ములగలంపాడు, భోగోలులోని రోడ్లు జూదరుల వాహనాలతో కిక్కిరిశాయి.

ముమ్మరంగా కోడి పందేలు

●లింగపాలెం మండలంలోని సోమవారం కలరాయనగూడెం, ములగలంపాడు, సింగగూడెం, కామవరపుకోట మండలంలోని పాతూరు, రావికంపాడు, సాగిపాడు, కామవరపుకోట, చింతలపూడి మండలం,రాఘవాపురం ,చింతంపల్లి, రేచర్ల, జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం, లక్కవరం, పేరంపేట, దేవులపల్లి, వేగవరంలో కోడి పందేలు జోరుగా సాగాయి. జిల్లాలోని చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాకుండా కృష్ణా, ఖమ్మం, తూర్పుగోదావరి, గుంటూరు, నల్గొండ, కర్నూలు జిల్లాల నుంచి పలువురు వాహనాల్లో భారీ ఎత్తున తరలివచ్చి పందేల్లో పాల్గొన్నారు. బరుల వద్ద టెంట్లు, వెలుతురు కోసం విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు.

●కుక్కునూరు మండలంలో సోమవారం కోడిపందేల జోరుగా సాగాయి.మండలంలోని వేలేరు, చిరవెల్లి, కివ్వాక, కుక్కునూరు, దాచారం తదితర గ్రామాల్లో కోడిపందేలు నిర్వహించారు.బరుల వద్ద గుండాట, కోతాట, పేకాట వంటి జూద క్రీడలు కొనసాగాయి.చిరవెల్లిలో కోడిపందేల బరుల వద్ద పలువురు గొడవ దిగి కొట్టుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆర్అండ్‌బీ రహదారి అతి సమీపంలో కోడిపందేల బరులు ఏర్పాటు చేయడంతో సామాన్య ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వేలేరులో కోడిపందేల బరుల వద్దకు తెలంగాణ నుంచి భారీ హాజరైయ్యారు. కనీసం మంగళ, బుధవారాల్లో నైనా పోలీస్ యంత్రాంగం సామాన్యులకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేశారు.

ద్వారకాతిరుమల మండలంలో..

●ద్వారకాతిరుమల: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలో కోడిపందేలు సోమవారం జోరుగా జరిగాయి. తిమ్మాపురం, పంగిడిగూడెం, ఎం.నాగులపల్లి, గుణ్ణంపల్లి, మలసానికుంట, తిరుమలంపాలెం, పి.కన్నాపురం, దొరసానిపాడు, ద్వారకాతిరుమల, వెంకటకృష్ణాపురం, తూర్ల లక్ష్మీపురంలో పందేలను నిర్వహించారు.

జంగారెడ్డిగూడెం మండలంలో కోడిపందేల జోరు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పట్టణం మండలంలో కోడిపందేలు, జూదాలు యథేచ్ఛగా నిర్వహించారు. కూటమి నేతలు కోడిపందేలు, జూదాల్లో పాల్గొనడం గమనార్హం. జంగారెడ్డిగూడెంలో సుబ్బంపేట, బుట్టాయగూడెం రోడ్డు, బైపాస్ రోడ్డు, మండలంలో శ్రీనివాసపురం, వేగవరం, ఎ.పోలవరం, తాడువాయి, తిరుమలాపురం, కేతవరం, పేరంపేట, పంగిడిగూడెం, లక్కవరం, దేవులపల్లి, చక్రదేవరపల్లి, గుర్వాయిగూడెం గ్రామాల్లో కోడిపందేలు నిర్వహించారు. కోడిపందాల బరుల వద్ద గుండాటలు, లోన బయట, కోతాటలు నిర్వహించారు. బరుల వద్ద బిర్యానీ పాయింట్‌లు, ఇతర తినుబండారాలు, కూల్‌డ్రింక్ షాపులు ఏర్పాటు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి కోడిపందాల బరుల వద్ద మద్యం షాపులు కూడా ఏర్పాటు చేయడం గమనార్హం. శ్రీనివాసపురంలో కోడిపందేల బరిని డీకేడీ సత్యనారాయణ ప్రారంభించారు. శ్రీనివాసపురంలో కోడిపందేలు నిర్వహించారు.


జంగారెడ్డిగూడెం: శ్రీనివాసపురంలో కోళ్లను పందెంకు సిద్ధం చేస్తున్న దృశ్యం


జంగారెడ్డిగూడెం: కోడిపందేల బరి వద్ద బిర్యాని పాయింట్


బుట్టాయగూడెం: తహసీల్దార్ కార్యాలయం సమీపంలో


ద్వారకాతిరుమల: తిరుమలంపాలెంలో కోడి పందెం


కుక్కునూరు: దాచారం బరి వద్ద కోడిపందెంకు సిద్ధం


కుక్కునూరు: వేలేరు వద్ద రహదారిపై నిలిచిన ట్రాఫిక్

గిరి పల్లెల్లో సంక్రాంతి శోభ



కొయ్యలగూడెం: ధర్మారావుపేటలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు
బుట్టాయగూడెం: కృష్ణాపురంలో రంగవల్లులు దిద్దుతున్న మహిళలు

బుట్టాయగూడెం: పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోని గిరిపల్లెలో సంక్రాంతి శోభ సంతరించుకుంది. మూడు రోజులపాటు జరిగే ఈ సంక్రాంతి వేడుకలను మన్యవాసులు ఘనంగా నిర్వహించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. సోమవారం ప్రారంభమైన భోగి పండుగను ప్రజలు వైభవంగా నిర్వహించారు. అర్ధరాత్రి నుంచే భోగి మంటలు వేశారు. సంప్రదాయ వస్త్రధారణతో చిన్నారులు భోగి మంటలలో భోగి దండలను వేసి పూజలు చేశారు. తెల్లవారుజామున మంటల్లో వేడి నీడిని కాచుకుని పలువురు తలస్నానం చేసి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ఇళ్ల ముంగిళ్లను రంగవల్లులతో అలంకరించారు. గ్రామాల్లో బసవన్నలతో గంగిరెద్దుల వాళ్లు ఇంటింటికీ తిరుగుతూ అయ్యవారికి దండం పెట్టు, అమ్మవారిని ఆశీర్వదించు అంటూ సందడి చేశారు. ఇంటి ముందుకు వచ్చిన బసవన్నకు నమస్కరించి గంగిరెద్దుల వాళ్లకు సంతోషంగా రకరకాల పిండి వంటలు, ధాన్యంతో పాటు తమకు తోచినంత సహాయాన్ని మహిళలు అందించారు. పలు గ్రామాల్లో చిన్నారులకు భోగిపండ్లు పోసి పూలు ఆయురారోగ్యాలతో చిరంజీవిగా ఉండాలని దీవించారు. లక్ష్మీపురంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గంగానమ్మతల్లికి ఘనంగా ఊరేగింపు నిర్వహించారు.

ఘనంగా భోగి వేడుకలు

కొయ్యలగూడెం: ధర్మారావుపేటలో క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి వేడుకలు ప్రజలను అబ్బురపరిచాయి. గ్రామీణ వాతావరణంలో ప్రతిబింబించేలా బొమ్మరిల్లు, రైతు నాగలి, ఎడ్ల బండ్లు, బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. కూచిపూడి, భరతనాట్య ప్రదర్శన, గంగిరెద్ల విన్యాసాలు ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలకు క్షత్రియ సేవా సమితి పెద్దలు బహుమతి ప్రదానం చేశారు.

జంగారెడ్డిగూడెంలో..

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పట్టణంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. భోగి మంటలు వేసి ప్రజలు వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వందనపు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జంగారెడ్డిగూడెంలోని ముత్యాలమ్మ ఆలయ నిర్మాణకర్త బవిరిశెట్టి మురళి కృష్ణ ఆధ్వర్యంలో బవిరిశెట్టి వారి వీధిలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా అందాల రంగవల్లులతో అందంగా అలంకరించారు. చిన్న పెద్ద అందరూ భోగి మంటలు వేసి దాని చుట్టూ తిరుగుతూ ఆటపాటలతో వినోదాత్మకంగా గడిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గంగిరెడ్డి విన్యాసాలు చూపర్లను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం అందరూ పట్టు వస్త్రాలతో సాంప్రదాయబద్ధంగా భోగి పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా రకరకాల బొమ్మలతో బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. చిన్నారులకు భోగి పండుగ సంప్రదాయ విశిష్టతను తెలిపే విధంగా భోగి పండ్లను పోశారు. కార్యక్రమం నిర్వహణ చేసిన మురళీకృష్ణను పలువురు అభినందించారు.


జంగారెడ్డిగూడెంలో భోగి మంట వద్ద సందడి


జంగారెడ్డిగూడెం: బసవన్న ఆశీర్వాదం తీసుకుంటున్న దృశ్యం


జంగారెడ్డిగూడెంలో బసవన్నకు పూజలు


జంగారెడ్డిగూడెం: భోగి మంట వద్ద వేడుకలు

భోగి మంటల్లో విద్యుత్ బిల్లుల దహనం

బుట్టాయగూడెం: విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ మండలంలోని రెడ్డిగణపవరంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో సోమవారం విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు అందుగుల ఫ్రాన్సిస్ మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచమని చెప్పి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యుత్ చార్జీల భారం ప్రజలపై మోపిందన్నారు. పెంచిన చార్జీలను తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ విద్యుత్ చార్జీలను తగ్గించడంతోపాటు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కారం ముత్యాలరావు, భీమరాజు, చంద్రకళ, నాగమణి పాల్గొన్నారు.

కామవరపుకోట: రాష్ట్ర ప్రభుత్వం కరెంట్ చార్జీలు పెంచిన తగ్గించాలని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ వామపక్షాలు నిరసన తెలియజేస్తూ పార్టీ పిలుపు మేరకు కామవరపుకోట మండల కేంద్రంలో పాతూరులో భోగి మంటల్లో కరెంట్ బిల్లు దహనం చేశారు. కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా కార్యదర్శి ఏ ఫ్రాన్సిస్ మాట్లాడుతూ కూటమి ముఖ్యమంత్రి ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి నేడు కరెంట్ చార్జీలు పెంచారని విమర్శించారు. అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడవకముందే ప్రజలపై ట్రూ ఆప్ చార్జీల పేరుతో, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేస్తామంటూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నారని అన్నారు. ప్రజలపై చార్జీలు పెంచి కూటమి ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని ఫ్రాన్సిస్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎ.దుర్గారావు, ఎం.వీరయ్య, ఏ.వెంకటేశ్వరరావు, భవాని, ప్రకాష్, అడవికొట్టు రామకృష్ణ పాల్గొన్నారు.


పాతూరులో విద్యుత్ బిల్లును దహనం చేస్తున్న కేవీపీఎస్ సభ్యులు

టి.నరసాపురం: స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ కరెంట్ పంపిణీ విధానాన్ని యథావిధిగా అమలు చేయాలని కోరుతూ సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని అప్పలరాజుగూడెంలో సోమవారం విద్యుత్ బిల్లులు పెంపును నిరసిస్తూ విద్యుత్ బిల్లులను భోగి మంటలో వేసి దహనం చేసి సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. పార్టీ జిల్లా కమిటీ నాయకులు గూడెల్లి వెంకట్రావు, నాయకులు రాజు, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి: ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై రాష్ట్ర ప్రభుత్వం రూ.17వేల కోట్ల విద్యుత్ బిల్లుల భారాన్ని మోపటం అన్యాయమని సీపీఎం మండల కన్వీనర్ పి.పాండురంగారావు విమర్శించారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ సీపీఎం పిలుపు మేరకు ప్రజాసంఘాల కార్యాలయం వద్ద సోమవారం భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలపై ప్రజలకు ఇచ్చిన వాగ్దానాన్ని విస్మరించి ట్రూ అప్ చార్జీలను పెంచిందని ఆరోపించారు. విద్యుత్ ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై మోపిన భారాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు రామిశెట్టి సత్యనారాయణ, ఎస్ సూర్యకుమార్, కె అనురాధ, వరలక్ష్మీదేవి, వేణు పాల్గొన్నారు.


బుట్టాయగూడెంలో భోగిమంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న దృశ్యం


విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో దహనం చేస్తున్న దృశ్యం

బాల్య వివాహాలు అన్ని విధాలుగా చేటు

భీమడోలు: బాల్య వివాహాలు అన్ని విధాలుగా చేటు అని భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్య బృందం ఆనంద్, రాజా, ఆంజనేయులు అన్నారు. భీమడోలులో సోమవారం చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ (క్రాఫ్) ఆధ్వర్యంలో బాల్య వివాహ నిరోధంపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. బాల్య వివాహాలు జరిగితే 112, 1098కు ఫోన్ చేయాలని డాక్టర్లు సూచించారు. జిల్లా కోఆర్డినేటర్ ఆర్. వినోద్‌కుమార్, క్రాఫ్ సీఎస్‌డబ్ల్యు కె.రామలక్ష్మి, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.